సాక్షి ప్రకాశం

ఆదివారం । 1 । జనవరి । 2023

I



నూతన సంవత్సర కానుక

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర కానుకగా ఈ ఏడాది ఆరంభంలోనే అంగన్‌వాడీల్లో ఉద్యోగ అవకాశాలను ప్రభుత్వం కల్పించనుంది.

- IIలో..



సేవా దృక్పథంతో పేరుతెచ్చుకోవాలి

రాజకీయాల్లో సేవా దృక్పథంతో మంచిపేరు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు.

- IIలో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30 /20

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఒంగోలు: ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, జిల్లా ప్రజా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు వేర్వేరు ప్రకటనల్లో ఆకాంక్షించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, పాత్రికేయులతో సహా అందరికీ 2023వ సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. అందరికీ సుఖ సంతోషాలు ఇవ్వాలని భగవంతుడ్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు నివాసంలో అందుబాటులో బాలినేని

ఒంగోలు: వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నూతన సంవత్సరం దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం తన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఇంటివద్ద జరిగే నూతన సంవత్సర వేడుకల్లో ఆయన పాల్గొంటారు.

టీటీడీ ఈవో ధర్మారెడ్డిని ఓదార్చిన మంత్రి సురేష్



యర్రగొండపాలెం: ఇటీవల మృతి చెందిన టీటీడీ ఈవో ధర్మారెడ్డి కుమారుడు చంద్రమౌళి చిత్రపటానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పూలమాలవేసి నివాళులర్పించారు. శనివారం నంద్యాల జిల్లా పారుమంచాల గ్రామంలో జరిగిన వైకుంఠ సమారాధనకు హాజరైన మంత్రి ధర్మారెడ్డిని ఓదార్చారు. అనారోగ్యంతో మృతి చెందిన పెద్దదోర్నాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.ఎస్.రాజేంద్రకుమార్ కుటుంబ సభ్యులను మంత్రి సురేష్ పరామర్శించారు. నంద్యాల జిల్లా ఆత్మకూరుకు వెళ్లి ప్రిన్సిపాల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి సోదరుడు, జార్జి విద్యా సంస్థల సెక్రటరీ డాక్టర్ ఆదిమూలపు సతీష్ పాల్గొన్నారు.



2023 న్యూ ఇయర్ అంకెలతో ఒంగోలులో చిన్నారుల జోష్

తొలి పరిమళం

కేకల కోత.. బైకల మోత.. వేడుకల హంగామా
యూత్ ఖుషీ.. కార్లు రయ్.. స్వీట్లు సై..

న్యూ ఇయర్ అంటే ఇంతేనా?
నో.. ఇది కొత్త ఆశల ప్రపంచం
నూతన ఆలోచనల దళం
ఫ్యూచర్‌ని తెలిపే పతంగం

దుఃఖాలను మరిపించే సుగంధం
చేదు జ్ఞాపకాలను తుంచేసే గమనం
విష్ యూ హ్యాపీ న్యూ ఇయర్!!!



ఒంగోలులోని బీకే అపార్ట్‌మెంట్స్ వద్ద డ్యాన్స్‌లతో యువతుల ఉత్సాహం



ఒంగోలులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో జరిగిన న్యూ ఇయర్ వేడుకల్లో యువతుల కేరింత

ఫొటోలు - ఎం.ప్రసాద్, సాక్షి

భలే మంచి రోజు



తెల్లవారక ముందే ఇంటి తలుపు తట్టి పింఛన్ ఇవ్వడం ఒక సంచలనం..అర్హులందరికీ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి నగదు పంపిణీ చేసి ఆనందాన్ని నింపుతున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నూతన సంవత్సర శుభాకాంక్షలతో జనవరి నుంచి పెంచిన పింఛన్ రూ.2750 ప్రభుత్వం ఇవ్వనుంది. జిల్లా వ్యాప్తంగా తాజాగా 9 వేల పింఛన్లు పెరిగాయి. దీంతో లబ్ధిదారుల సంఖ్య 2,91,605కి చేరింది. లబ్ధిదారులకు ఇది శుభవార్తే.



- నేటి నుంచి కొత్త పింఛన్ల పంపిణీ
- వారం రోజుల పాటు వారోత్సవాలు
- అవ్వా...తాతలతో పాటు పింఛనుదారుల్లో ఆనందం
- జిల్లాలో కొత్తగా 9,103 పింఛన్లు మంజూరు
- దీంతో నూతనంగా రూ.250 చొప్పున పెరిగిన పింఛనుదారులైన 2,39,700 లక్షల మందికి లబ్ధి


ఇప్పటి వరకు జిల్లాలో ఇస్తున్న పింఛన్లు: **2,82,502**

పాత, కొత్త పింఛన్లు కలుపుకొని మొత్తం: **2,91,605**

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: అవ్వ...తాతలకు... అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నూతన సంవత్సర కానుక అందిస్తున్నారు. 2019 సాధారణ ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను ప్రతి సంవత్సరం పెంచుకుంటూ పోతున్నారు. ఎన్నికలకు రెండు నెలల ముందు వరకు చంద్రబాబు ప్రభుత్వం పింఛను కేవలం రూ.1,000 మాత్రమే ఇస్తూ వచ్చింది. ఎన్నికల హామీలో భాగంగా అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రూ.2 వేలు ఇస్తానని వైఎస్ జగన్ హామీ ఇవ్వటంతో చంద్రబాబు 2019 ఫిబ్రవరి నెల నుంచి మాత్రమే స్వల్పంగా పెంచారు. ఇచ్చిన మాట మేరకు 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే పింఛను రూ.2,250 పెంచి ఇవ్వడం ప్రారంభించారు. 2022 జనవరిలో రూ.2,500లకు పెంచారు. ప్రస్తుతం 2023 జనవరి నుంచి రూ.2,750 కి పెంచి ఇవ్వనున్నారు. అందులో భాగంగా నూతన సంవత్సర కానుకలో భాగంగా జనవరి ఒకటో తేదీ నుంచి వారం రోజులపాటు వారోత్సవాలు నిర్వహించాలని సీఎం జిల్లా యంత్రాంగాన్ని ఇప్పటికే ఆదేశించారు. పింఛనుతో పాటు సీఎం వైఎస్ జగన్ పంపిన సందేశాన్ని కూడా అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అందించనున్నారు.

2,39,700 మందికి లబ్ధి:

ప్రభుత్వం ఒక్కొక్కరికి పెంచిన పింఛను రూ.250 జిల్లాలో మొత్తం 2,39,700 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు మొత్తం కలిపి దాదాపు 18 రకాలు ఉన్నాయి. వీటన్నింటికీ కలిపి జిల్లాలో 2022 డిసెంబర్‌లో పంపిణీ చేసిన లెక్కల ప్రకారం 2,82,502 మంది లబ్ధిదారులున్నారు. వారిలో ప్రస్తుతం పెంచిన పింఛన్లకు అర్హులైన వారు 2,39,700 లక్షల మంది. వీళ్లందరికీ జనవరి నెల నుంచి ప్రతి నెలా రూ.2,750 చొప్పున వలంటీర్లు ఇంటికి వెళ్లి అందించనున్నారు. వీరుకాకుండా మిగతా పది రకాల పింఛన్లు తీసుకునే వారు 42,802 మంది ఉన్నారు. వీరిలో నెలకు రూ.3 వేలు చొప్పున తీసుకునే వికలాంగులు, హిజ్రాలు, డప్పు కళాకారులు, బహుళ వైకల్య కుష్టు వ్యాధిగ్రస్తులు ఉన్నారు. అదేవిధంగా నెలకు రూ.5 వేల, రూ.10 వేలు తీసుకొనే వారు కూడా ఉన్నారు. మొత్తంగా పాత, కొత్త పింఛన్లు కలుపుకొని జిల్లా వ్యాప్తంగా 3,01,605 మంది లబ్ధిదారులున్నారు. వీళ్లందరికీ జనవరి ఒకటో తేదీన పింఛన్లు అందించనున్నారు.



కొత్తగా మంజూరైన పింఛన్లు 9,103:

ప్రభుత్వ అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్న ఒకే ఒక్క లక్ష్యంగా ముందుకు సాగుతోంది. అందులో భాగంగా ఇప్పటి వరకు ఇచ్చే పింఛన్లలో అర్హత ఉన్నా కొన్ని సాంకేతిక కారణాల వల్ల రాకపోతే వారు వార్డు, గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. వాళ్లందరినీ పరిశీలించాక జిల్లాలో కొత్తగా మొత్తం 9,103 మంది వివిధ రకాల పింఛన్లు తీసుకోవటానికి అర్హులుగా తేలారు. దీంతో వారికి కూడా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని వివిధ రకాల పింఛన్లు ఇంటి వద్దకే వెళ్లి అందించనున్నారు. మొత్తం 11 రకాల పెన్షన్ల కోసం వీరిని ఎంపిక చేశారు.

పింఛను రకం	లబ్ధిదారుల సంఖ్య
వృద్ధాప్య పింఛన్లు(ఓపీ)	3,735
వితంతువులు	3,357
వికలాంగులు	1,289
ఎయిడ్స్/హెచ్ఐవీ(ఏఆర్‌టీ)	566
ట్రెడీషనల్ కోబ్లర్స్	335
డప్పు కళాకారులు	281
మత్స్యకారులు	47
ఒంటరి మహిళలు	46
చేనేతలు	10
కళ్ళు గీత కార్మికులు	02
ట్రాన్స్‌జండర్లు	01

పింఛను రకం	లబ్ధిదారుల సంఖ్య
వృద్ధాప్య పింఛను (ఓపీ)	1,61,451
వితంతువులు	60,235
చేనేతలు	1,934
కల్లుగీత కార్మికులు	262
మత్స్యకారులు	2,481
చర్మకారులు	4,354
ఒంటరి మహిళలు	7,832
హెచ్ఐవీ/ఎయిడ్స్ (ఏఆర్‌టీ)	1,151

పింఛన్లు తీసేస్తారన్న అపోహలు నమ్మవద్దు

లేనిపోని కారణాలు చూపి పింఛన్లు తీసేస్తారన్న అపోహలు ఎవరూ నమ్మవద్దు. కావాలని కొందరు పనిగట్టుకొని ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేయాలని చూస్తున్నారు. అలా ప్రచారం చేస్తే సహించేది లేదు. అలాంటి వారిపై కఠిన చర్యలు కూడా తీసుకుంటాం. సాంకేతిక కారణాల వల్ల కొన్ని సమస్యలు ఏర్పడినప్పుడు అలాంటి వారికి నోటీసులు అందించాం. విచారణ పూర్తిచేశాం. అత్యధిక పింఛన్లు తిరిగి పునరుద్ధరించాం. ఎవరికీ అనవసరంగా పింఛను తొలగించరు. ఈ ఏడాది కొత్తగా 9 వేలకుపైగా పింఛన్లు మంజూరు చేశాం.

- ఏఎస్.దినేష్ కుమార్, కలెక్టర్

పింఛన్ల పంపిణీకి డబ్బు ఇప్పటికే డ్రా చేశాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు నూతన సంవత్సరంలో పింఛన్ల పంపిణీని ఒకటో తేదీనాడు చేపట్టేందుకు ఇప్పటికే బ్యాంకుల నుంచి డబ్బులు కూడా డ్రా చేశాం. సచివాలయాలు, క్లస్టర్ల వారీగా పంపిణీకి సిబ్బంది, వాలంటీర్లు సిద్ధంగా ఉన్నారు. మూడో తేదీన ముఖ్యమంత్రి చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం చేపట్టినా ఒకటో తేదీ నుంచే పంపిణీ ప్రారంభిస్తున్నాం. పింఛను వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నాం. కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ ఆదేశాల మేరకు అన్నీ సిద్ధం చేశాం.

- బి.బాబూరావు, డీఆర్‌డీఏ పీడీ, జిల్లా పింఛన్ల పంపిణీ నోడల్ ఆఫీసర్

వైఎస్ కుటుంబం పేదలకు అండ



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబం పేదలకు అండగా ఉంటుంది. ఇంతకు ముందు పింఛన్ తీసుకోవాలంటే చాలా ఇబ్బందులు పడేవారం. మా గురించి ఆలోచన చేసేవారు తక్కువ. కానీ దేవుడు వచ్చాడు మార్పు తెచ్చాడు. వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి పింఛన్ ఇచ్చి వెళ్తున్నారు.

- ముసలయ్య, పుల్లలచెరువు, మత్స్యకారుడు.

గడప గడపలో ఆత్మీయంగా...

- సమస్యలు తెలుసుకుంటూ... ప్రతి ఒక్కరితో మాట్లాడుతూ
- నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన బాలినేని

ఒంగోలు సబర్బన్: గడప గడపలో ఆత్మీయత...కుటుంబ సభ్యునిలా ఆదరణ...వాసన్నా అంటూ ఆప్యాయంగా పలకరింపు...నగరంలో జరుగుతున్న గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి బ్రహ్మరథం పడుతున్నారు. కుటుంబ సభ్యునిలా ఆదరిస్తున్నారు. ఒంగోలు నగరంలో శనివారం 33వ డివిజన్ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బాలినేని నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ పెద్దిరెడ్డి నియంత కుమారి విజయ భాస్కర రెడ్డిలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముంగమూరు రోడ్డులోని జర్నలిస్టు కాలనీ, శివప్రసాదు కాలనీ, ఆర్టీసీ కాలనీల్లో నిర్వహించారు. తొలుత బాలినేని ప్రజలందరికీ 2023 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లలా చేసుకుంటూ, ప్రజలకు సేవచేసేలా ఆ భగవంతుడు బలాన్ని చేకూర్చేలా ఆశీర్వదించాలని కోరుకుంటున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన తీరును బాలినేని స్వయంగా ప్రజలను అడిగి తెలుసుకుంటున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని విధంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు స్థానికులకు వివరిస్తున్నారు. పింఛన్లు ఠంచనుగా ఒకటో తేదీన వాలంటీర్ ఇంటికి వచ్చి ఇచ్చిపోతున్నారని వృద్ధులు, వికలాంగులు సంతోషంగా బాలినేనికి చెబుతున్నారు. కొత్తగా ఎంపిక చేసిన పింఛన్లు, రూ.2500 నుంచి రూ.2750కి పెంచిన పింఛన్లు కూడా నూతన సంవత్సరం మొదటి రోజు ఒకటో తేదీ నుంచి పంపిణీ చేస్తున్నట్లు బాలినేని వెల్లడించారు.



చిన్నారి అభిషై ముఖంమీద ఉన్న గడ్డ గురించి బాలినేనికి వివరిస్తున్న బిడ్డ తల్లి రాజేశ్వరి

కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, 33వ డివిజన్ కార్పొరేటర్ పెద్దిరెడ్డి నియంత కుమారి విజయ భాస్కర రెడ్డి, డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, పార్టీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కఠారి శంకర్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంటా రామానాయుడు, కార్పొరేటర్లు యనమల నాగరాజు, గిరిజా శంకర శాండిల్య, శ్రీరాం నాగభూషణం, తాడి కృష్ణలత, ఫాతిమా, రషీదా, ట్రేడ్ యూనియన్ నాయకులు జాజుల కృష్ణ, పుచ్చకాయల గోవర్ధన్ రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు దామరాజు క్రాంతి కుమార్, గొర్రెపాటి శ్రీనివాసరావు, చింతగుంట్ల సువర్ణ, కొమ్మూరి రవిచంద్ర, తమ్మిశెట్టి మాధవి, పోతంశెట్టి వెంకటరత్నం, బొమ్మినేని మురళి, తూము పద్మ, అమ్మిశెట్టి ఆంజనేయులు, కార్పొరేషన్ డైరెక్టర్ కరుణాకర్, ఊసా మధు బాబు, బైరెడ్డి అరుణ, పల్లా అనూరాధ, తిర్లిక శ్రీనివాసరావు, తోటపల్లి సోమశేఖర్, అద్దేపల్లి సురేష్, సుతారం శ్రీనివాసులు, గోలి తిరుపతి రావు, జే.పున్నయ్య, రావులపల్లి నాగేశ్వరరావు, నక్కల లీలా కుమారి, డివిజన్ నాయకులు డివిజన్ అధ్యక్షుడు పందిటి కాశీరామ్ (జేమ్స్), మిలిటరీ కాలనీ ఎస్‌కే నాగూర్, ఓగిరాల శ్రీనివాసులు, జయరామిరెడ్డి, కోటా రాంబాబు, నగేష్, ముంతాజ్, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, రమాదేవి, మద్దులూరి వెంకటేశ్వర్లు, శోభ, ఏసు, బక్కా రోశయ్య, బాబూరావు, పింగల సందీప్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

తల్లి ఆవేదనకు చలించిన బాలినేని

తన బిడ్డ అనారోగ్యంతో పడుతున్న కష్టంపై ఓ కన్నతల్లి వెల్లడించిన ఆవేదనకు బాలినేని చలించిపోయారు. 16వ డివిజన్‌కు చెందిన పాట్నూరి రాజేశ్వరి తన 16 నెలల కుమారుడు అభిషై ముఖంపై లేచిన పెద్ద గడ్డ వల్ల నిద్రాహారాలు మాని రోదిస్తున్నాడని బాలినేని దృష్టికి తీసుకొచ్చింది. స్పందించిన బాలినేని ఆ చిన్నారి ఆపరేషన్‌కు ఎంత ఖర్చయినా తాను చేయిస్తానని భరోసా ఇచ్చారు. ఆపరేషన్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పీఏని ఆదేశించారు.

2024 టార్గెట్ 175



చీమకుర్తిలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: "ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024 అసెంబ్లీ ఎన్నికల్లో 175/175 స్థానాలు సాధించాలనే టార్గెట్‌తో పనిచేస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సమన్వయంతో కలిసి పనిచేసి జగన్‌ని మళ్లీ సీఎంగా చేసుకుందామని" జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో చీమకుర్తిలో శనివారం ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్ల సమావేశంలో బూచేపల్లి వెంకాయమ్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయాల ప్రాతిపదికగా నియమించిన కన్వీనర్లు రానున్న ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసి గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు మాట్లాడుతూ సీఎం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవడంతో పాటు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ నూతనంగా నియమించిన సచివాలయాల కన్వీనర్‌లను అభినందించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసేందుకు కన్వీనర్‌లు కష్టపడి పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, పార్టీ మండల మాజీ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, కౌన్సిలర్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సచివాలయాల కన్వీనర్‌లు, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాలువలో పడి వ్యక్తి మృతి


మృతుడు స్వర్ణ సుబ్బారావు

టంగుటూరు: ప్రమాదవశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఎం. నిడమానూరు సమీపంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన స్వర్ణ సుబ్బారావు (60) పొలానికి వెళ్లి వస్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి పక్కన ఉన్న కుంటలో పడి తీవ్రగాయాల పాలై మృతి చెందాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై ఖాదర్‌బాషా పరిశీలించి, పంచనామా నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి


మృతిచెందిన రవణమ్మ

సీఎస్ పురం: రాత్రివేళ నిద్రిస్తున్న మహిళను పాము కాటు వేయడంతో మృతి చెందిన సంఘటన సీఎస్ పురం మండలంలోని డీజీ పేట ఎస్సీకాలనీలో శనివారం వేకువజామున చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు... నెల్లూరు జిల్లా కొండాపురం మండలం చల్లగిరిగిల గ్రామానికి చెందిన గున్నా రవణమ్మ (45) భర్త మృతి చెందడంతో చెన్నై వెళ్లి కూలి పనులు చేసుకుంటూ జీవిస్తోంది. క్రిస్మస్ పండుగ జరుపుకునేందుకు ఇటీవల డీజీ పేటలోని అమ్మగారి ఇంటికి వచ్చింది. ఎప్పటిలాగే కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం రాత్రి ఇంటి వరండాలో నేలపై పడుకుని నిద్రపోయింది. శనివారం వేకువజామున పాము కాటు వేయడంతో నిద్ర లేచి కుటుంబ సభ్యులకు తెలియజేసింది. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఒంగోలు తరలిస్తుండగా మార్గం మధ్యలో రవణమ్మ మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

రాజేశ్వరి కుటుంబానికి చంద్రబాబు పరామర్శ


పెట్లూరులో మాట్లాడుతున్న చంద్రబాబు

పెట్లూరు (మర్రిపూడి): ఇటీవల కందుకూరులో టీడీపీ నిర్వహించిన బహిరంగ సభలో తొక్కిసలాట జరిగి 8 మంది మృతిచెందిన విషయం తెలిసిందే. మృతుల్లో ఒకరైన కొండపి మండలం పెట్లూరు గ్రామానికి చెందిన ఈదుమూడి రాజేశ్వరి (40) కుటుంబ సభ్యులను టీడీపీ అధినేత చంద్రబాబు శనివారం పరామర్శించారు. రాజేశ్వరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. చంద్రబాబు వెంట కొండపి ఎమ్మెల్యే డోలాశ్రీ బాలవీరాంజనేయులు, దామచర్ల జనార్దన్, సత్య, పాలపర్తి డేవిడ్‌రాజు, సర్పంచ్ జాన్సీరాణి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు దుర్మరణం

తర్లుపాడు: బైక్ అదుపు తప్పి ట్రాక్టర్ ట్రక్కు ఢీకొనడంతో బాలుడు మృతి చెందాడు. మార్కాపురం పట్టణానికి చెందిన వెంకటేశ్వర్లు కుమారుడు శరత్ చంద్ర (15) పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 10 వ తరగతి చదువుతున్నాడు. స్నేహితులతో కలిసి సరదాగా బైక్ పై వెళ్తున్న క్రమంలో మండలంలోని గోరుగుంతలపాడు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి బైక్ ఢీ కొంది. తలకు బలమైన గాయాలు కావడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తాడివారి పల్లి ఎస్సై ముక్కంటి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నూతన సంవత్సర కానుక

- జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీకి రంగం సిద్ధం
- 2022లో రెండుసార్లు ఎంపిక ప్రక్రియ పూర్తి
- 2023 మొదట్లోనే నియామకాలకు కసరత్తు
- 25 మెయిన్, 2 మినీ అంగన్‌వాడీ కార్యకర్తల భర్తీకి సన్నాహాలు
- 91 అంగన్‌వాడీ ఆయాల నియామకాలకు నోటిఫికేషన్లు
- వివరాలు వెల్లడించిన జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ధనలక్ష్మి



ఒంగోలు సబర్బన్: జిల్లా ప్రజలకు 2023 నూతన సంవత్సర కానుకగా ఏడాది ఆరంభంలోనే అంగన్‌వాడీల్లో ఉద్యోగ అవకాశాలను ప్రభుత్వం కల్పించనుంది. అందులో భాగంగా నూతనంగా జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల్లో ఖాళీగా ఉన్న కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులను భర్తీ చేయడానికి ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ నియామక కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. కలెక్టర్‌తో పాటు కన్వీనర్‌గా ఉన్న జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వై.ధనలక్ష్మి జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 18 అంగన్‌వాడీ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వాలని సంబంధిత సీడీపీవోలను ఆదేశించారు. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి 2022వ సంవత్సరంలో రెండు సార్లు ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. గత సంవత్సరం ఫిబ్రవరిలో మొదటిసారి, సెప్టెంబర్‌లో రెండోసారి ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ప్రస్తుతం మూడోసారి ఎంపిక ప్రక్రియను డిసెంబర్‌లో ప్రారంభించినప్పటికీ 2023 నూతన సంవత్సరంలో జనవరి నెలలోనే ఎంపిక ప్రక్రియను పూర్తి చేయనున్నారు. అందులో భాగంగా సీడీపీవోలకు 2022 డిసెంబర్ 29న ఉత్తర్వులు జారీ చేశారు. సీడీపీవోల వారీగా డిసెంబర్ 30న నోటిఫికేషన్లు విడుదల చేశారు. డిసెంబర్ 30 నుంచి 2023 జనవరి 9వ తేదీలోగా అభ్యర్థులు సీడీపీవో కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అంగన్‌వాడీ పోస్టులు ఖాళీలు ఉన్న వార్డు, గ్రామ సచివాలయాల్లో నోటీస్ బోర్డుల్లో కూడా నోటిఫికేషన్లు ప్రచురించాలని తెలిపారు.

జిల్లాలో మొత్తం 18 అంగన్‌వాడీ ప్రాజెక్టులు...

జిల్లా వ్యాప్తంగా ఒంగోలు, మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్ల పరిధిలో మొత్తం 18 అంగన్‌వాడీ ప్రాజెక్టులు ఉన్నాయి. నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాకు చెందిన వేటపాలెం ప్రాజెక్టు, నెల్లూరు జిల్లాకు చెందిన ఉలవపాడు ప్రాజెక్టు కూడా ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో నిర్వహించే ఎంపిక ప్రక్రియలో భాగమై ఉన్నాయి. వాటన్నింటిలో మొత్తం 25 అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు, రెండు మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులు, 91 అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా ఉన్న అన్ని పోస్టులకు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కోసం ఆయా సీడీపీవోలు నోటిఫికేషన్లు జారీ చేశారు.

ఒంగోలు రెవెన్యూ డివిజన్ పరిధిలో...

ఒంగోలు రెవెన్యూ డివిజన్ పరిధిలో 7 అంగన్‌వాడీ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటిలో 15 కార్యకర్తలు, ఒక మినీ కార్యకర్త, 60 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒంగోలు అర్బన్ సీడీపీవో పరిధిలో ఒక అంగన్‌వాడీ కార్యకర్త, ఒక మినీ అంగన్‌వాడీ కార్యకర్త, 12 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఒంగోలు రూరల్ సీడీపీవో పరిధిలో 5 కార్యకర్తలు, 9 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మద్దిపాడు సీడీపీవో పరిధిలో 5 కార్యకర్తలు, 29 ఆయాలు, వేటపాలెం సీడీపీవో పరిధిలో 2 కార్యకర్తలు, 2 ఆయాలు, కొండపి సీడీపీవో పరిధిలో 3 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉలవపాడు సీడీపీవో పరిధిలో రెండు ఆయాలు, తాళ్లూరు సీడీపీవో పరిధిలో రెండు కార్యకర్తలు, 3 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో...

కనిగిరి రెవెన్యూ డివిజన్ పరిధిలో 5 అంగన్‌వాడీ ప్రాజెక్టులు ఉన్నాయి. అందులో ఒక కార్యకర్త, 11 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందులో తర్లుపాడు సీడీపీవో పరిధిలో మూడు ఆయా పోస్టులు, పొదిలి సీడీపీవో పరిధిలో రెండు ఆయాల పోస్టులు, కనిగిరి సీడీపీవో పరిధిలో మూడు ఆయా పోస్టులు, వెలిగండ్ల సీడీపీవో పరిధిలో ఒక కార్యకర్త పోస్టు, తాళ్లూరు సీడీపీవో పరిధిలో మూడు ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మార్కాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో...

మార్కాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో మొత్తం ఆరు ప్రాజెక్టులు ఉండగా, వాటిలో 9 అంగన్‌వాడీ కార్యకర్తలు, ఒక మినీ కార్యకర్త, 20 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందులో భాగంగా గిద్దలూరు సీడీపీవో పరిధిలో ఒక కార్యకర్త, ఒక ఆయా పోస్టు, బేస్తవారిపేట సీడీపీవో పరిధిలో మూడు కార్యకర్తలు, 5 ఆయా పోస్టులు, మార్కాపురం అర్బన్ పరిధిలో ఒక ఆయా, మార్కాపురం రూరల్ పరిధిలో రెండు కార్యకర్తలు, ఒక ఆయా, యర్రగొండపాలెం పరిధిలో మూడు కార్యకర్తలు, ఒక మినీ కార్యకర్త, 11 ఆయా పోస్టులు, తర్లుపాడులో ఒక ఆయా పోస్టు ఖాళీగా ఉన్నాయి.


పతకాలతో సత్తా చాటిన పోలీసు క్రీడాకారులతో ఎస్పీ మలికాగర్గ్

సత్తా చాటిన ప్రకాశం పోలీసులు

- మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్స్‌లో 8 స్వర్ణాలు సహా 33 పతకాలు కైవసం
- ఎస్పీ అభినందనలు

ఒంగోలు టౌన్: నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో గత ఏడాది డిసెంబరు 16,17 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ -2022 పోటీల్లో ప్రకాశం జిల్లా పోలీసులు సత్తా చాటారు. 100 మీటర్లు, 800 మీటర్లు, 1500 మీటర్లు, 4x400,4x100రిలే, 5 కి.మీ, 10 కి.మీ 100 మీటర్ల హార్డిల్స్ లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, జావెలిన త్రో పోటీల్లో అత్యద్భుత ప్రతిభను కనబరిచి 8 స్వర్ణ పతకాలు, 8 వెండి పతకాలు, 17 కాంస్య పతకాలను సాధించారు. 11 పోలీసు అధికారులు 33 పతకాలను సాధించి ప్రకాశం పోలీసుల కీర్తి ప్రతిష్టలను రాష్ట్ర స్థాయిలో చాటి చెప్పారు.

విజేతల వివరాలు:

ఆర్.రాంబాబు, ఒంగోలు రూరల్.. 100 మీటర్ల పరుగు (వెండి), ఏఎస్ఐ షేక్ ఖాశీం, డీటీసీ.. షాట్‌పుట్, డిస్కస్ త్రో (స్వర్ణం), జావెలిన్ త్రో (కాంస్యం), ఏఎస్ఐ యస్.వరలక్ష్మి, తాలుకా పీఎస్.. 5 కి.మీ, 1500 మీటర్ల పరుగు (స్వర్ణం), 800 మీటర్ల పరుగు, 4100 రిలే (కాంస్యం), ఏఎస్ఐ యం. వెంకట లక్ష్మి, మద్దిపాడు.. 100 మీటర్లు (స్వర్ణం), లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్ (కాంస్యం).

స్వాట్ టీం కానిస్టేబుల్స్...

జి.నాగార్జున నాయక్ , 5 కి.మీ, 800 మీటర్లు, 400 మీటర్లు (కాంస్యం) 4x100 రిలే (స్వర్ణం), కె. శ్రీనివాస రావు, 5 కి.మీ, డిస్కస్ త్రో (వెండి), జావెలిన్ త్రో (కాంస్యం), 4x400 రిలే (స్వర్ణం), సి.హెచ్ నాగయ్య, 10 కి.మీ, 4x100 రిలే (కాంస్యం), 4x400 రిలే (స్వర్ణం), 400, 800 మీటర్లు (వెండి), జె.కిరణ్, 10 కి.మీ, 5 కి.మీ (వెండి), పి.అంకమ రావు, 100 మీటర్లు (కాంస్యం), కె.సురేష్, షాట్‌పుట్, డిస్కస్ త్రో (కాంస్యం), కె.విష్ణు వర్ధన్, 10 కి.మీ, 400 మీటర్లు (కాంస్యం), 800 మీటర్లు (వెండి) పతకాలను సాధించారు.


రూరల్ సీఐ రాంబాబుకు ప్రశంస పత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ

విజయం గర్వకారణం: ఎస్పీ

ఒకవైపు విధులు నిర్వహిస్తూ.. మరోవైపు క్రీడల్లో సత్తా చాటారని ఎస్పీ మలికా గర్గ్ అభినందించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ అద్భుతమైన ప్రతిభా పాటవాలు చాటడం ద్వారా జిల్లా పోలీసు శాఖకు గర్వకారణంగా నిలిచారని ప్రశంసల వర్షం కురిపించారు. భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని సత్తా చాటాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (క్రైమ్) యస్.వి శ్రీధర్ రావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఆర్ఐలు శ్రీహరి రెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంతో పేరు తెచ్చుకోవాలి

- పార్టీ అభివృద్ధిలో భాగస్వాములుగా నిలవండి
- ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, పక్కన చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: మీరంతా (మున్సిపల్ పాలక వర్గం) రాజకీయాల్లో మంచి పేరు తెచ్చుకుంటూ.. సేవా దృక్పథంతో ముందడుగు వేస్తుండటం ప్రశంసనీయమని ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యుడు బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అధ్యక్షతన జరిగిన మున్సిపల్ సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ పాల్గొని మాట్లాడారు. కొత్త ఏడాదిలో పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తానన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల అభివృద్ధికి తాను, చైర్మన్‌ను తీసుకెళ్లి మున్సిపల్ శాఖ మంత్రితో మాట్లాడి అధిక నిధులు తీసుకొస్తామని చెప్పారు. కుల, మత, వర్గ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందచేసినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు ఎవరిని ఇబ్బంది పెట్టలేదని, అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకం అందించామన్నారు. కరోనా కష్ట కాలంలో కూడా, నిధుల సమస్య ఉన్నప్పటికీ సంక్షేమం , అభివృద్ధి పనులు అమలు చేశామన్నారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు, వార్డు, గ్రామ ప్రజా ప్రతినిధులంతా సమష్టి పనిచేసి, ఎమ్మెల్యేగా తనకు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు తేవాలని కోరారు. ఎమ్మెల్యే వెళ్లిన తర్వాత అనంతరం చైర్మన్ గఫార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ట్రాఫిక్, సమస్యతో పాటు, పట్టణ ప్రజలకు ఇబ్బంది కరంగా ఉన్న బ్రాంది షాపులను పట్టణంలో లేకుండా బయటకు మార్చాలని కౌన్సిలర్ దేవకి రాజీవ్ కోరారు. కోఆప్షన్ సభ్యుడు చింతం శ్రీనివాసులు మాట్లాడుతూ టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి హాయంలో అనేక భూ అక్రమాలు జరిగాయని ఆరోపించారు. పేదల భూములను నిలువునా లాక్కున్నారని గుర్తు చేశారు. రాజకీయ స్వార్థంతో భూ వ్యాపారుల కడుపు కొట్టడం సరైంది కాదన్నారు. ప్రతి పక్షనేత ఉగ్ర చేసిన సవాల్ వల్లే అధికారులు భూ వ్యాపారులపై దాడులకు దిగారని ఆరోపించారు. ఉగ్ర చేసిన పని వల్ల చాలా మంది భూ వ్యాపారుల ఇళ్లలోని పెళ్లిళ్లు నిలిచాయని, ఆపాపం ఉగ్ర నరసింహారెడ్డిదే నన్నారు. అతని హయాంలో ఎన్నో భూ అక్రమాలు జరిగాయని, భూ వ్యాపారంలో టీడీపీ పార్టీ వాళ్లే ఎక్కువ మంది ఉన్నారని తెలిపారు. వెంచర్లలోని హద్దు రాళ్ల తొలగింపుకు మున్సిపల్ నిధులు ఖర్చు చేయడాన్ని అభ్యంతరం తెలిపారు.

ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ వెంచర్లు వేసిన తర్వాత రాళ్ల తొలగింపుకు మున్సిపల్ నిధులు వృథా చేయకుండా.. అసలు కొత్త వెంచర్లు వేయకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. బ్రాందీ షాపులు పట్టణంలో లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని వార్డులో కొత్త విద్యుత్ స్తంభాలు వేస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్, ఆర్ మాణిక్యరావు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

10 మంది గంజాయి విక్రేతల అరెస్టు

ఒంగోలు టౌన్: గంజాయి విక్రయిస్తున్న 10 మందిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. తాళ్లూరు మండలంలో జరిగిన ఈ సంఘటన వివరాలను ఎస్పీ మలికాగర్గ్ విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. గంజాయి కట్టడిలో భాగంగా పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా తాళ్లూరు మండలంలోని సోమవరప్పాడు ఎస్ఎస్సీ కాలనీకి చెందిన నాగులూరి కోటయ్య గంజాయి విక్రయిస్తున్నట్టు సమాచారం అందింది. దర్శి సీఐ నారాయణస్వామిరెడ్డి, తాళ్లూరు ఎస్సై నరసింహారావు నిందితుడి ఆచూకీ కోసం ఆ గ్రామానికి చేరుకున్నారు. అప్పటికే నిందితుడు పరారయ్యాడు. తాళ్లూరు తహసీల్దార్ సమక్షంలో కోటయ్య ఇంటి తాళాలు పగులగొట్టి లోపల సోదాలు నిర్వహించారు. ఇంట్లో ఒక మూల దాచి ఉంచిన 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ ఆదేశాలతో పరారీలో ఉన్న కోటయ్య కోసం రెండు బృందాలు ఏర్పాటు చేశారు. తూర్పు గంగవరంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తన ఇంట్లో దొరికిన గంజాయి తనదేనని పోలీసుల విచారణలో కోటయ్య అంగీకరించాడు. ఆ గంజాయిని ఉయ్యాల శ్రీనివాసరావు తన ఇంట్లో దాచినట్లు తెలిపాడు. దీంతో తీగలాగితే డొంక కదిలినట్లు నిందితులందరి వివరాలు బయటపడ్డాయి. ఏకలవ్యనగర్‌కు వెళ్లే దారిలో జామాయిలు తోట వద్ద గంజాయి ప్యాకెట్లతో ఉన్న మరో 9 మందిని అరెస్టు చేశారు. వారిలో సోమవరప్పాడు ఎస్ఎస్సీకాలనీకి చెందిన ఉయ్యాల శ్రీనివాసరావు, పెద్దకత్తుల వెంకటేశ్వర్లు, గుర్నాథం లాజర్, దారంవారిపాలెం గ్రామానికి చెందిన పోలా ప్రభాకర్, సోమవరప్పాడుకు చెందిన పోలా మార్తమ్మ, పోలా సుజాత, నాగులూరి పోలమ్మ, సంతనూతలపాడుకు చెందిన తన్నీరు సుశీల, చీమకుర్తి మండలం మర్రిచెట్లపాలెం గ్రామానికి చెందిన లక్ష్మీ తిరుపతమ్మను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 28 కిలోల గంజాయి, ఒక ఇన్నోవా కారు, రెండు మోటారు సైకిళ్లతో పాటు గంజాయి ప్యాకెట్ల తయారీలో ఉపయోగించే ఎలక్ట్రానిక్ వెయింగ్ మిషన్లను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సరఫరా, దాని వెనుకున్న అసలు పాత్రదారుల వివరాలపై దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను పట్టుకున్న దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, సీఐ రామకోటయ్య, సెబ్ సీఐ సుందర రామయ్య, తాళ్లూరు ఎస్సై నరసింహారావు, ఏఎస్ఐ మోహనరావు, హెడ్‌కానిస్టేబుళ్లు మధుసూదనరెడ్డి, భాగ్యరాజు, పవన్, మాలకొండయ్య, జగదీష్, ముబీన, నాగలక్ష్మి, ఆదిరెడ్డి, పార్వతి, తదితరులను ఎస్పీ మలికా గర్గ్ అభినందించారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, వాహనాలు

ఒంగోలులో భారీ చోరీ

- రూ.63 లక్షలు అపహరించిన దొంగలు

ఒంగోలు టౌన్: నగరంలో శనివారం భారీ దొంగతనం జరిగింది. నిత్యం రద్దీగా ఉండే దేవుడి చెరువు సమీపంలోని సీఆర్పీ క్వార్టర్స్‌లో జరగడం సంచలనం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం.. సీఆర్పీ క్వార్టర్స్‌లో నివాసం ఉండే వరికూట్ల వెంకట కృష్ణయ్య కొత్తపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్లో స్కూలు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్య భ్రమరాంబ ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగం చేసి 2018లో వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు. వ్యక్తిగత పనుల నిమిత్తం ఆమె మార్కాపురం వెళ్లి ఉన్నారు. శనివారం ఉదయం 9 గంటలకు కృష్ణయ్య స్కూలుకు వెళ్లారు. సాయంత్రం 5 గంటలకు తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటి వెనుక తలుపులకు రంధ్రం వేసి ఉండటంతో దొంగతనం జరిగినట్లు అనుమానం వచ్చింది. ఇంట్లో చూసుకోగా, కప్ బోర్డులో దాచి ఉంచిన రూ.63 లక్షలు కనిపించలేదు. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు కృష్ణయ్య సమాచారం అందించారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న అడిషనల్ ఎస్పీ (క్రైమ్) ఎస్‌వీ శ్రీధరరావు, డీఎస్పీ యు.నాగరాజు చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. కృష్ణయ్య ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చోరీ జరిగిన ఇంట్లో వివరాలు సేకరిస్తున్న పోలీసు అధికారులు


తలుపులకు దొంగలు వేసిన రంధ్రాలు

2023 నూతన సంవత్సర శుభాకాంక్షలు 2023

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

- సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

నాగులుప్పలపాడు: ప్రతి గ్రామ సచివాలయాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని పార్టీ పటిష్టతకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పిలుపునిచ్చారు. మండలంలోని మద్దిరాలపాడు గ్రామంలో వైఎస్సార్ సీపీ మండల కార్యాలయంలో శనివారం సాయంత్రం సచివాలయాల నూతన కన్వీనర్లు, వలంటీర్లు, గ్రామ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధాకర్‌బాబు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి పాటించాల్సిన విధివిధానాలపై సలహాలు, సూచనలు చేశారు. అనంతరం ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో నూతనంగా ఎంపిక చేసిన సచివాలయ కన్వీనర్లను ఎమ్మెల్యే పరిచయం చేసుకుని అభినందించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ యాదల రత్నభారతి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ పోలవరపు శ్రీమన్నారాయణ, నాయకులు మారెళ్ల వెంకట శేషయ్య, పెనుబోతు రంగారావు, పరిశీలకులు దుంపా యలమందారెడ్డి, ఘట్టినేని అయ్యన్న, గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపీసీకి మరమ్మతులు చేయాలి

ఆలూరు (కొత్తపట్నం): ఆలూరులోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి పైకప్పు పోయిందని, మరమ్మతులు చేసి ఉపయోగంలోకి తీసుకురావాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి పంచాయతీ కార్యదర్శి ఏవీ సురేష్‌ను ఆదేశించారు. ఆలూరు గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించి కేంద్రాన్ని పరిశీలించారు. మరమ్మతులకు కావాల్సిన నిధులను పంచాయతీ, మండల పరిషత్ గ్రాంట్ నుంచి తీసుకుని పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలోని చెత్తాచెదారాన్ని కేంద్రానికి తీసుకొచ్చి తడి, పొడి చెత్త వేరు చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలో పర్యటించి దోమలు ఉత్పత్తి కాకుండా మురికి నీటిని బయటకు తరలించాలన్నారు. డీపీవో వెంట ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య, శైలేష్‌బాబు, క్లాప్‌మిత్రలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్‌లో ఏటీఎం ప్రారంభం

ఒంగోలు సబర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ మెయిన్ ఎంట్రన్స్‌లో ఎస్‌బీఐ ఏటీఎంను ఆ బ్యాంకు రీజినల్ మేనేజర్ ఎస్.సుబ్రహ్మణ్యం శనివారం ప్రారంభించారు. ఖాతాదారులకు నాణ్యమైన సేవలు అందించడమే ఎస్‌బీఐ లక్ష్యమని అన్నారు. ఆర్టీసీ ఆర్ఎం సుధాకర్, పలు డిపోల మేనేజర్లు, ఎస్‌బీఐ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

చీమకుర్తి: మండలంలోని మువ్వవారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి శనివారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఈవో టీ రవి, హెచ్ఎం శ్రీనివాసరావు, మారం వెంకటేశ్వరరెడ్డి, బడే దశరథరామిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, దండు మధు, కోటా రాములు, పల్లపు బాలయ్య పాల్గొన్నారు.

సాంకేతిక విద్యను సద్వినియోగం చేసుకోవాలి

- ట్యాబ్‌లు పంపిణీ చేసిన జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి


ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న రవీంద్రరెడ్డి

ఈతముక్కల (కొత్తపట్నం): సాంకేతిక పద్ధతిలో విద్య అందించడానికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేస్తున్న ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని ఈతముక్కల హైస్కూల్లో శనివారం ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రవీంద్రరెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు రాణించాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నారని చెప్పారు. అనంతరం మొత్తం 180 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శెట్టి కోటేశ్వరమ్మ, మడనూరు సర్పంచ్ గంగవరపు కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు బండారు రుక్మిణమ్మ, బండారు వెంకటసుబ్బారావు, నారాయణరెడ్డి, కసుకుర్తి శ్రీనివాసరావు, హెచ్ఎం శివయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులదే బాధ్యత

- విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి
- డీఈవో విజయభాస్కర్


సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో విజయభాస్కర్

ఒంగోలు: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని డీఈవో బి.విజయభాస్కర్ అన్నారు. స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఒంగోలు డివిజన్ పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో శనివారం సాయంత్రం ఆయన సమీక్షించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోందన్నారు. జనవరి 2న ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించి జిల్లా స్థాయి సమావేశంలో తెలియజేసిన విషయాలు వివరించాలన్నారు. పదో తరగతి పరీక్షల షెడ్యూల్‌కు అనుగుణంగా ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట స్టడీ క్లాస్‌లు నిర్వహించుకునేందుకు ప్లాన్ చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించేందుకు ఎలాంటి చర్యలు అవసరమో ఎప్పటికప్పుడు గుర్తించుకుంటూ బోధన కొనసాగించాలన్నారు. ఉప విద్యాశాఖ అధికారి అనితరోజ్‌మేరీ మాట్లాడుతూ వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో మిగులు ఉపాధ్యాయులను పలు పాఠశాలలకు సర్దుబాటు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారని తెలిపారు. వారిలో 60 శాతం మంది కేటాయించిన పాఠశాలల్లో ఇంకా చేరలేదన్నారు. తక్షణమే హెడ్మాస్టర్లు సంబంధిత ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని, లేని పక్షంలో అందుకు హెడ్మాస్టర్లే బాధ్యత వహించాలని హెచ్చరించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఒంగోలు విద్యార్థులు

ఒంగోలు: జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఒంగోలుకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికయ్యారు. శనివారం గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన యూనివర్శిటీ స్థాయి పోటీల్లో ఒంగోలుకు చెందిన ఎం.రామకృష్ణ (75 కేజీలు కుమితే), కె.ప్రేమ్‌కుమార్ (50 కేజీలు కుమితే అండ్ కటా) ప్రతిభ కనబరిచి త్వరలో జాతీయ స్థాయిలో నిర్వహించనున్న అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను కరాటే అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేఎంఎల్ శాస్త్రి, ప్రధాన కార్యదర్శి కె.కీర్తన తదితరులు అభినందించారు.


పోటీలకు ఎంపికైన కరాటే విద్యార్థులు

డిఫెన్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి సహకారం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: సైనికుల సంక్షేమం కోసం తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. శనివారం స్పందన భవనంలో జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు రూపొందించిన క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాజీ సైనికుల అవసరాలు తీర్చడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇచ్చి వేగంగా పరిష్కరిస్తామన్నారు. అన్నీ విధాలుగా దేశం కోసం పాటుపడిన సైనిక ఉద్యోగులకు అండగా ఉంటామన్నారు. దీనిలో యునైటెడ్ డిఫెన్స్ వెటరన్స్ సంఘం రాష్ట్ర చైర్మన్ నెప్పలి నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ పాశం వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు ఆలపాటి వెంకటేశ్వర్లు, మిలిటరీ క్యాంటీన్ మేనేజర్ గుమ్మడి వెంకటేశ్వరరావు, డాక్టర్ చిట్టితోటి జీవన్, సుబ్బనాచారి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు మండలంలో పూర్తయిన డ్రోన్ సర్వే

మద్దిపాడు: మండలంలోని అన్ని గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తయినట్లు మండల ఇన్‌చార్జి సర్వేయర్ సుశీల్ తెలిపారు. మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి సమక్షంలో శనివారం డ్రోన్ ఎగుర వేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో ఎక్కడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సర్వే పూర్తి చేయాలని సర్వేయర్లను ఆదేశించారు.



2023 - ఆకాంక్షలు



ప్రతి కుటుంబం వర్ధిల్లు గాక!

కాలం చల్లటి నీడనిచ్చే చెట్టు కావాలి. వడగాడ్పు నుంచి, ఊపి కొట్టే వాన నుంచి, గడ్డ కట్టే చలి నుంచి అది మనుషులను కాయాలి. పంటలు సమృద్ధిగా పండాలి. తియ్యటి మామిడిపండ్లు బండ్ల కొద్దీ మండీలకు చేరాలి. పూలు సలీసుగా దొరకాలి. కొలనుల్లో చేపల వీపులను తామరతూడులు తడమాలి. నదులు ఒండ్రుమట్టిని ఒడ్డుకు తోస్తూ ప్రవహించాలి. సముద్రాలు శాంత వచనాలు పలకాలి. మహమ్మారులు తోకలు ముడవాలి. ఒకటీ అరా మాత్రలతో తగ్గిపోయే రోగాలే చలామణిలో ఉండాలి. నాలుగు గోడలు లేపినవాడు పైకప్పు వేసుకోగలగాలి. గూడే లేని వాడు ఇంత జాగా సంపాదించుకోవాలి. ఉద్యోగాలు ఇబ్బడి ముబ్బడిగా చేతికందాలి. కాయకష్టం చేసేవాడు బువ్వకు లోటెరగక ఉండాలి. పాలకులు పెద్ద మనసు చేసుకోవాలి. కట్నాలు, లాంఛనాల జంజాటాలు లేక అప్పుల బెంగ ఎరగని పెళ్ళిళ్లు జరగాలి. ఆడపిల్లలు సగౌరవంగా, సురక్షితంగా ఉండాలి. స్త్రీల గెలుపు గాథలు వినిపించాలి. యువతీ యువకుల సబబైన ఇష్టాలు చెల్లుబాటు కావాలి. రహదారులు క్షేమమార్గాలుగా విలసిల్లాలి. సమాజం శాంతితో నిండాలి. అశాంతి కొరకు ప్రయత్నించే ప్రతి చర్యా చతికిలపడాలి. హేతువుకు చోటు దక్కాలి.

ప్రతి ఇల్లు పాలు తేనెల సమృద్ధితో నిండాలి. తాతయ్య, నానమ్మలు కులాసాగా ఉండాలి. అమ్మ చెప్పినట్టు అందరూ వినాలి. నాన్న జేబు ఎప్పుడూ నిండుగా ఉండాలి. పిల్లలు సదా పకపక లాడాలి. చదువులెన్నో బుద్ధిగా చదవాలి. బంధువులందరూ బలగంగా ఉండాలి. స్నేహితులందరూ శక్తిగా మారాలి. కొత్త సంవత్సరం అందరికీ శుభాలు తేవాలి. ప్రతి కుటుంబం వర్ధిల్లాలి.

మంచిని తలుద్దాం. విశ్వం వింటుంది.
గట్టిగా అనుకుందాం. తప్పక నెరవేరుతుంది.
హ్యాపీ న్యూ ఇయర్.







* ఎంపిక

న్యూఇయర్ గిఫ్ట్

న్యూ ఇయర్ సందర్భంగా ఆత్మీయులకు కానుకలు ఇచ్చి ఆనందాన్ని పంచుకోవాలనుకుంటారు. అందుకు ఖరీదైన కానుకలనే ఎంచుకోనక్కర్లేదు. మీరిచ్చే బహుమతి ఆశ్చర్యాన్ని కలిగించనక్కర్లేదు. సానుకూలమైన ఆలోచనలు కలిగించేవిగా ఉంటే చాలు. కొన్ని నెలల తర్వాత చెత్త బుట్టలో పడేసే వాటిని ఇచ్చే బదులు తక్కువ ఖర్చుతో పర్యావరణ స్నేహపూర్వక కానుకలను ఇస్తే అన్ని చోట్లా ఆనందం రెట్టింపు అవుతుంది.

పెయింట్ వేసిన కుండీలు

ఇండోర్ లేదా అవుట్ డోర్‌లలో అందమైన పెయింట్ చేసిన మొక్కల కుండీలను కూడా అలంకరణకు వాడుతుంటారు. స్వయంగా పెయింట్ చేసిన కుండీలను కూడా కానుకకు ఎంపిక చేసుకోవచ్చు.



పచ్చని కానుక

మొక్కలను ప్రేమించనివారుండరు. అవి ఇండోర్ లేదా అవుట్ డోర్ కావచ్చు. గృహాలంకరణలోనూ మొక్కలకు కొంత ప్లేస్‌ను కేటాయిస్తుంటారు. ఇలాంటి అభిరుచి గలవారికి చిన్న చిన్న మొక్కలు ఉన్న కుండీలను కానుకగా ఇవ్వచ్చు. విత్తన ప్యాకెట్లను ఎంపిక చేసి ఇవ్వచ్చు. స్థానికంగా ఉన్న నర్సరీలో మొక్కల కొనుగోలుకు కొంత మొత్తం చెల్లించి, ఆ రసీదును కానుకగా ఇవ్వచ్చు. ఆ రసీదుతో వారే తమకు కావల్సిన మొక్కలను ఎంచుకుంటారు.



క్లే బాటిల్.. ఉడెన్ స్పూన్స్

పర్యావరణ హితమైన వాటిలో నిత్యం ఉపయోగపడేవి ఎన్నో అందుబాటులోకి వచ్చాయి. వాటిలో స్టోరేజీ బాస్కెట్, క్లే బాటిల్స్, ఉడెన్ స్పూన్స్, టెర్రకోట షోకేస్ లేదా కిచెన్ ఐటమ్స్, జూట్ బ్యాగ్స్.. ఇతర యాక్సెసరీస్ ఎంపిక చేసుకోవచ్చు.





రీ సైకింగ్..

ఫాస్ట్ ఫ్యాషన్‌లో కొట్టుకుపోతున్న ఈ రోజుల్లో మనవైన సంప్రదాయ హస్తకళలతో రూపుదిద్దుకున్న అలంకార వస్తువులను కానుకగా ఇవ్వచ్చు. వాటిలో ఫ్యాబ్రిక్, థ్రెడ్, ఉడెన్, టెర్రకోట జ్యువెలరీ, ఎంబ్రాయిడరీ చేసిన స్కార్ఫ్స్.. వంటివి ఎంచుకోవచ్చు. **ఇలాంటి ప్రత్యేకమైన కానుకలు సందర్భానికి తగిన విధంగా ఇస్తే ఆత్మీయులను మరింత చేరువ చేస్తాయి.**

బ్యూటిప్స్

బాదం గింజల్లో విటమిన్ ఇ పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మానికి పోషణను అందిస్తుంది. అలాగే నిర్జీవంగా మారిన చర్మకణాలకు జీవం పోస్తుంది. పాలు చర్మాన్ని మాయిశ్చరైజ్ చేస్తాయి.



ఐదు నుంచి ఆరు బాదం గింజలను తీసుకొని వాటిని నానబెట్టాలి. బాగా నానిన తర్వాత వాటి తొక్క తీసి గింజలను పేస్ట్‌లా తయారు చేయాలి. ఆపై కొద్దిగా పాలు కలిపి ముఖానికి, మెడకు రాసి పావుగంట ఆరనివ్వాలి. ఆ తర్వాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాల్సి ఉంటుంది.

ఈ ఫేస్ ప్యాక్ చర్మానికి ఇన్‌స్టంట్ బ్రైట్ నెస్ అందించడం మాత్రమే కాకుండా చర్మాన్ని అందంగా, మృదువుగానూ మారుస్తుంది. కాబట్టి దీనిని రెగ్యులర్ ఫేస్ ప్యాక్స్ మాదిరిగానూ ఉపయోగించవచ్చు.

ముగ్గు ముచ్చట



21 చుక్కలు: 21 వరసలు



మద్దల పద్మావతి
పెండోటవారి వీధి, తెనాలి



సరస్వతి
తాండూరు

18 చుక్కలు: 18 వరసలు



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com
* అడ్రస్‌లో మీ ఊరి పేరుతోపాటు మీ కాలనీ పేరు కూడా రాయండి.

సంవత్సర ఫలాలు



2023. ఈ సంవత్సరం అంకెలు మొత్తం కూడితే 2+0+2+3=7, వస్తుంది. 7 అంకె కేతుగ్రహానికి సంకేతం. దీని ప్రభావం వలన వైద్యం, ఆరోగ్యం, ఆధ్యాత్మికత, పురాతన గ్రంథాలు, మరుగున పడిన తాంత్రిక విద్యలు, ఆయుర్వేదం, జ్యోతిషం వంటి విద్యలలో సృజనాత్మక మార్పులు, అభివృద్ధి జరుగుతాయి. వైద్య విద్య, వైద్య పరిశోధనలపై ప్రజలకు, ప్రభుత్వానికి ఎక్కువ ఆసక్తి కలుగుతుంది. ఫైనాన్స్, మేనేజ్‌మెంట్ రంగంపై విద్యార్థులలో ఆసక్తి ఎక్కువ అవుతుంది. స్టాక్ మార్కెట్‌పై కూడా ఆసక్తి పెరుగుతుంది. స్టాక్ మార్కెట్ ఫిబ్రవరి వరకు అస్తవ్యస్తంగా ఉంటుంది. ఫిబ్రవరి 2023 తరువాత లాభదాయకంగా ఉంటుంది.

ఈ 2023 సంవత్సరం మొత్తం అంకెలు కలవగా 7 వస్తుంది. కాబట్టి ఈ సంవత్సరం మొత్తం కేతు ప్రభావం కూడా ఎక్కువగా ఉంటుంది. అదే విధంగా జ్యోతిషపరంగా చూసినా 2023 సంవత్సరం ఆదివారం, అశ్విని నక్షత్రం (01-01-2023)తో ప్రారంభం అయ్యి, ఆదివారం, మఖ నక్షత్రం (31-12-2023)తో ముగుస్తుంది. ఈ విధంగా ఈ సంవత్సరం కేతు నక్షత్రం (అశ్విని)తో మొదయ్యి, కేతు నక్షత్రం (మఖ)తో ముగుస్తుంది. అందువలన కేతు గ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

ఈ 2023 శోభకృత్ నామ సంవత్సరంలో ఆధ్యాత్మికత పెరుగుతుంది. కష్టాల నుండి విముక్తి కలిగి ఆత్మజ్ఞానం, తాత్విక జ్ఞానం, ఆత్మాభిమానం కలిగి మంచి పాజిటివ్ ఆలోచనలు కలిగి ప్రజలు అభివృద్ధి పథం వైపు అడుగులు వేస్తారు.

1, 10, 19, 28 తేదీలలో జన్మించినవారికి 2023 సంవత్సరంలో సూర్య, చంద్ర, కేతు గురు గ్రహాల ప్రభావం ఉంటుంది. గురు ప్రభావం వలన ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. పరిశోధన, మైనింగ్ రాజకీయ రంగాలలో ఉన్న వారికి నూతన అవకాశాలు. బాధ్యతలు పెరుగుతాయి. దీనితోపాటు ఆర్థికవృద్ధి, అదృష్టం కలిసి వస్తాయి. కొత్త పథకాలు, వ్యాపారాల ద్వారా లాభాలు గడిస్తారు. విదేశాలలో విద్య, ఉద్యోగం కోసం ప్రయత్నించే వారికి ఇది మంచి సమయం. సంఘంలో గౌరవం పెరుగుతుంది. అవివాహితులకు వివాహ యోగం. వైవాహిక జీవితంలో ఉన్నవారికి స్పర్థలు, అపోహలు తొలగి మంచి వైవాహిక జీవితం గడుపుతారు. భార్య/భర్త ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి. నైతికత, విలువలు పాటించాలి. లేకపోతే సన్నిహితులు మిత్రులు దూరం అయ్యే అవకాశం ఉంది. అహంభావం విడిచిపెట్టి గొప్పవారి సాయం తీసుకుంటే లాభదాయకంగా ఉంటుంది. గత సంవత్సరంతో పోల్చితే ఈ సంవత్సరంలో సామాజికంగా పేరు ప్రఖ్యాతులు వస్తాయి. కోర్టు కేసుల్లో అనుకూలమైన తీర్పులు వస్తాయి.

ఆరోగ్యం మెరుగుపడుతుంది. మంచి ఆలోచనలు కలిగి మీ సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది. నిరుద్యోగులకు ఉద్యోగప్రాప్తి, విద్యలో పూర్తి చేయని కోర్స్‌లు ఉంటే అవి పూర్తి చేస్తారు. డిగ్రీ చేతికి వస్తుంది.

పరిశోధనా రంగం వైద్య రంగం జ్యోతిషం తాంత్రిక విద్యలు మొదలైన రంగాలలో ఉన్నవారికి 2023 సంవత్సరం చాలా మంచి సంవత్సరం. అధిక ఒత్తిడి తీసుకోకుండా శాంతంగా ఉంటూ అహంభావాన్ని విడిచి పెట్టి ప్రయత్నిస్తే ఈ సంవత్సరం మీ జీవితంలో నూతన అధ్యాయానికి నాంది అని చెప్పవచ్చు. దుర్గా సప్తసతి పారాయణ వలన మంచి ఫలితాలు పొందుతారు.

2, 11, 20, 29 తేదీలలో పుట్టినవారికి న్యూమరాలజీ ప్రకారం 2,7 చంద్రునికి సంబంధించిన అంకెలు. ఈ సంవత్సరంలో వీరికి ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. అవివాహితులకు వివాహయోగం. సృజనాత్మకత పెరుగుతుంది. రచయితలకు,నటులకు, కళాకారులకు ఇది మంచి సమయం. నటులకు, కళాకారుకి మంచి అవకాశాలు దొరికి, చిత్ర రంగంలో మంచి పేరు వచ్చే అవకాశం ఉంది. విద్యార్థులకు ఉన్నత విద్య అవకాశాలు ఉన్నాయి. ఈ సంవత్సరంలో సమాచార రంగం బాగుంటుంది. ఈ సంవత్సరం 23 సంఖ్య (2+3) కాబట్టి 5 బుధుడి సంఖ్య. దీనివలన స్టాక్ మార్కెట్‌లో అభివృద్ధి ఉంటుంది. సంవత్సర సంఖ్యలోని 3 గురుడుకి సంబంధించి సంఖ్య కావటం వలన పుట్టిన తేదీ (2,11,20,29) చంద్రుడికి సంబంధించినది కావటం వలన చంద్ర గురువుల కలయిక వలన రాజయోగం కలుగుతుంది. స్నేహితులు, బంధువులతో సత్సంబంధాలు ఏర్పడతాయి. పాత మిత్రులను కలుస్తారు. కార్యాలయంలో గుర్తింపు వస్తుంది. గమ్యాలను చేరుకోగలుగుతారు. చాలా కాలంగా విదేశాలలో ఉన్నవారు స్వదేశం వస్తారు. అప్పు కోసం ప్రయత్నించేవారికి అప్పు దొరుకుతుంది. ఆకర్షణ శక్తి పెరిగి స్నేహితులు ఎక్కువ అవుతారు. గృహోపకరణ, విలాస వస్తువులు కొంటారు. నగదు కోసం ఇబ్బంది పడాల్సి వస్తుంది. అందువలన జాగ్రత్తగా ఖర్చు చెయ్యాలి. హీలింగ్ చేసేవారికి, వక్తలకు ఇది మంచి సమయం. విష్ణు సహస్ర నామం పారాయణం, శ్రవణం చేయటం, రుద్రాభిషేకం, హనుమాన్ చాలీసా పారాయణ వలన మంచి ఫలితాలు వస్తాయి. మీ ఆదాయంలో 2 నుంచి 10 శాతం వికలాంగులకు దానం చేయటం వలన మీ వృత్తిలో ఆదాయ వృద్ధి కలుగుతుంది.

3, 12, 21, 30 తేదీలలో జన్మించినవారికి గురు గ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వీరు నిరంతరం శక్తి సంపన్నులుగా, ఆశావాదులుగా ఉండి తమ ప్రతిభ ద్వారా ఇతరుల కంటే ఎక్కువగా రాణిస్తారు. వీరిపై బుధ, గురు, కేతు ప్రభావం ఉంటుంది. ఈ సంవత్సరంలో ఏ వయసు వారైనా కొత్త పరిజ్ఞానాన్ని పొందుతారు. వృత్తివిద్యలు, నూతన సాంకేతిక విద్యలు నేర్చుకుంటారు. విద్యార్థులకు మంచి సమయం. విదేశీ విద్య కోరిక నెరవేరుతుంది. వీరికి ఈ సంవత్సరం నూతన ఉత్సాహంతో నిర్మాణాత్మకంగా ఉంటుంది. మధ్యలో చదువు ఆపినవారు కొత్త కోర్సులు చేయాలనే కోరిక కలిగి ముందుకు వెళతారు. ఈ సంవత్సరంలో గౌరవ పట్టాలు పొందుతారు. వ్యవసాయదారులకు ఆదాయం పెరుగుతుంది. వేరుసెనగలు, కందులు, పసుపు పండించేవారికి లాభదాయకం. కొత్తకొత్త వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తారు. సంతానం లేనివారికి సంతానం కలుగుతుంది. సంతానం ఉన్నవారి పిల్లలు ఉద్యోగం వచ్చి సెటిల్ అవుతారు. భార్యాభర్తల మధ్య అన్యోన్యత పెరుగుతుంది. షేర్‌మార్కెట్‌లో లాభాలు వస్తాయి. తండ్రికి మంచి సమయం. విదేశీ పర్యటన, పుణ్యక్షేత్రాల దర్శనం జరుగుతాయి. ఈ సంవత్సరంలో తీసుకొనే నిర్ణయాల వలన వచ్చే సంవత్సరంలో లాభాలు వస్తాయి. నైతికంగా ఉండాల్సిన అవసరం ఉంది. మే నుండి పిల్లల విషయంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి.

దక్షిణామూర్తిని కొలవటం వలన మంచి ఫలితాలు వస్తాయి. ఆదాయంలో 2 నుంచి 10 శాతం పేద విద్యార్థులకు గురువులకు, ఇంటి పురోహితులకు దానం చేయటం వలన మంచి ఫలితాలు వస్తాయి.

4, 13, 22, 31 తేదీలలో జన్మించినవారిపై రాహు గ్రహ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రాహు గ్రహం మీద చాలా మందికి వ్యతిరేకత, అపోహలు ఉంటాయి. కానీ రాహు సంఖ్య 4 చాలా మంచి సంఖ్య. వీరు నిర్మాణాత్మక వైఖరి, వాస్తవిక పంథా, స్థిరత్వం, నైపుణ్యం, ప్రశాంతత శాస్త్రీయమైన బాధ్యతాయుతమైన ఆలోచన, కష్టించే గుణం నిజాయితీ, విశ్వాస పాత్రత, పట్టుదల కలిగి ఉంటారు.

బుధ రాహుల కలయిక వీరిని గొప్ప నిపుణులుగా చేస్తుంది. రాహు అంటే కొత్త సాంకేతిక నైపుణ్యం కలిగి ఉండటం. ఏ వయసులోవారైనా కొత్త టెక్నాలజీ నేర్చుకోవటం, ఆ రంగంలో ఉన్నవారు నూతన ఆవిష్కరణలు చేయటం, దాని వలన పేరు ప్రఖ్యాతులు, సంపద పొందటం జరుగుతుంది. కోర్టు కేసులలో విజయం లభిస్తుంది. వివాహం కానివారికి వివాహం జరుగుతుంది. వివాదాలలో ఉన్న వీరి స్థలం వీరికి లభిస్తుంది. కొత్త ఇల్లు కట్టుకుంటారు. పోటీ పరీక్షలలో ఉత్తీర్ణులై మంచి ఉద్యోగాలు సంపాదిస్తారు. రెండో పెళ్ళి కోసం ఎదురు చూసేవారికి ద్వితీయ వివాహం జరుగుతుంది. సంవత్సర సంఖ్యలో 3, జన్మ తేదీ రాహు సంఖ్య అవ్వటం వలన గురు ఛండాల యోగం పడుతుంది. కాబట్టి వీరు ఏ నిర్ణయమైనా తీసుకొనే ముందు ఆలోచించి విజ్ఞుల సలహాలు తీసుకొని చేస్తే మంచిది. గురు ఛండాల యోగం ఉన్నందున ప్రేమ వ్యవహారాలు, రిలేషన్ షిప్‌లో ఉండటం మంచిది కాదు. రాజకీయ నాయకులకు పదవులు లభిస్తాయి. ఎంతటి క్లిష్టమైన ఎన్నికలోనైనా గెలుస్తారు.

సర్పదోష నివారణ పూజ, దక్షిణామూర్తి పూజ సుబ్రహ్మణ్య స్వామి పూజ చేయటం వలన మంచి జరుగుతుంది. పేదలకు, అనాథలకు, వికలాంగులకు అన్నదానం చేయడం మంచి ఫలితాన్ని ఇస్తుంది.

5, 14, 23 తేదీలలో జన్మించినవారు బుధ గ్రహ ప్రభావం వల్ల వీరు బహుముఖ ప్రజ్ఞాశాలురుగా ఉంటారు. క్రియాశీలత, సేచ్ఛా ప్రియత్వం, వినోదం, ఉల్లాసం, మంచి, ఆలోచనలు, తెలివి తేటలు, కార్య దక్షత కలిగి ఉంటారు. 2023 సంవత్సరం లో వీరిపై కేతుప్రభావం ఉంటుంది. సంవత్సరం 23(5) కాబట్టి బుధ ప్రభావం ఉంటుంది. వీరి జన్మతేదీ, సంవత్సర సంఖ్య రెండూ 5 కావడం వల్ల బుధ ప్రభావతో వీరి తెలివి తేటలకు, కార్య నిర్వహణకు గుర్తింపు వస్తుంది. పబ్లిక్ రిలేషన్స్, సేల్స్, పర్యాటక రంగం టీవీ, సినిమా పత్రికా రంగాలలో ఉన్నవారైతే మంచి గుర్తింపు వస్తుంది. వ్యవసాయదారులకు కూరగాయలు చెరుకు, పెసలు, మినుములు పండించేవారికి లాభదాయకంగా ఉంటుంది. వీరు కొత్త భూములు, పొలాలు కొనే అవకాశం ఉంది. పెట్టుబడులకు ఇది మంచి సమయం. వ్యాపారస్తులకు లాభాలు వస్తాయి. నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. వ్యాపార లావాదేవీలలో డాక్యుమెంట్లపై సంతకం చేసేటప్పుడు కొంచెం జాగ్రత్తగా ఉండాలి. విద్యార్థులకు ఇది మంచి సంవత్సరం. పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారు. నిరుద్యోగులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఉద్యోగులు వేరే మంచి ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. తగినంత విశ్రాంతి తీసుకోవాలి. నోటిని అదుపులో ఉంచుకోకపోతే అవమానాలు జరుగుతాయి. ఆరోగ్యానికి సంబంధించి పంటి, కంటి పరీక్షలు చేయించుకోవాలి.

గణపతి ఆరాధన, రుద్రాభిషేకం వల్ల మంచి ఫలితాలు వస్తాయి. ఆదాయంలో రెండు నుంచి 10 శాతం దానం చేయటం మంచిది.

6, 15, 24 తేదీలలో జన్మించినవారు శుక్ర గ్రహ ప్రభావం వల్ల వీరికి కళాభిరుచి, సృజనాత్మకత, మానవ సేవ, విశ్వాస పాత్రత వంటి లక్షణాలు ఉంటాయి. త్యాగబుద్ధి, సేవాభావం కలిగి ఉంటారు. శుక్ర, బుధ సంబంధం వలన ఈ సంవత్సరం వైద్యం, జ్యోతిషం, తాంత్రిక సంబంధిత వృత్తుల వారికి చాలా మంచి కాలం. వైద్యులు నూతన వైద్యశాలలు ప్రారంభించే అవకాశం ఉంది. ఏ రంగంలో ఉన్నవారైనా ఆయా రంగాలలో పరిశోధనాత్మక వ్యాసాలు రాస్తారు. అవివాహితులకు వివాహ యోగం. ఈ సంవత్సరంలో వీరు ఎంతో ఆత్మతృప్తిని పొందుతారు. సంవత్సరమంతా చాలా రిలాక్స్‌డ్‌గా ఉంటారు. వివాహాది శుభకార్యాలు జరుగుతాయి. విదేశాలలో ఉన్నవారు స్వదేశం వచ్చి ఆనందంగా గడుపుతారు. విలాస వస్తువులు కొంటారు. ఊహించని ఆస్తి ప్రాప్తిస్తుంది. నటులు, సంగీతకారులకు, మీడియావారికి, నగల వ్యాపారులకు అనుకూలం. భాగస్వాములతో జాగ్రత్తగా ఉండాలి. రిలేషన్‌షిప్స్‌లో ఉండటం మంచిది కాదు. ప్రేమ వ్యవహారాలలో కూడా జాగ్రత్తగా ఉండాలి.

వీధి కుక్కలకు ఆహారం పెట్టడం, బీదవారికి దుప్పట్లు దానం చేయటం మంచిది. భృగు పాశుపత హోమం లేదా సుదర్శన హోమం చేయించుకోవటం మంచిది.

7, 16, 25 తేదీలలో జన్మించినవారిపై కేతు గ్రహ ప్రభావం ఉంటుంది. వీరికి తాత్విక చింతన, మానవాతీత శక్తులు ఉంటాయి. ఆధ్యాత్మికత మీద దృష్టి ఎక్కువగా ఉంటుంది. ఈ సంవత్సర సంఖ్య కూడా 2023(7) కేతు సంఖ్య. ఎవరికైనా జన్మ తేదీ, సంవత్సర సంఖ్య ఒక్కటిగా ఉన్నప్పుడు , వారిపై ఆ గ్రహ ప్రభావం సంపూర్ణంగా ఉంటుంది. వారు వారి రంగాలలో చక్కగా రాణిస్తారు. మంచి గుర్తింపు వస్తుంది. ఈ తేదీలలో పుట్టినవారు నర్సులు, వైద్యులు, డ్రగ్గిస్టులు, పురోహితులు, జ్యోతిషులుగా ఉంటారు. ఈ రంగాలలో ఉన్నవారికి ఈ సంవత్సరం అత్యంత లాభదాయకం అని చెప్పవచ్చు. విద్య, ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్ళాలనుకొనేవారి కోరిక నెరవేరుతుంది. పుణ్యక్షేత్ర దర్శనం జరుగుతుంది. వీరికి యోగా, ధ్యానం వంటి విషయాలపై మక్కువ ఎక్కువ అవుతుంది. ఈ సంవత్సరం వీరు వ్యాపారంలో రిస్క్ తీసుకోవటం మంచిది కాదు. ప్రేమ వ్యవహారాలలో తల దూర్చకుండా ఉంటే మంచిది. కోర్టులకి, పోలీస్ స్టేషన్స్‌కి వెళ్ళకుండా, సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవటం మంచిది. ఈ సంవత్సరం షేర్ మార్కెట్, స్పెక్యులేషన్‌కు దూరంగా ఉంటే మంచిది. వీరిలో అసాధారణ స్ఫురణ అధికంగా ఉండి ఆధ్యాత్మిక క్రమశిక్షణ పాటిస్తారు. వీరు వీరి రంగాలలో ప్రత్యేకమైన నైపుణ్యం సంపాదించి అందులో ప్రావీణ్యత సాధిస్తారు.

ఆంజనేయస్వామి ఆరాధన, గణపతి ఆరాధన వలన మెరుగైన ఫలితాలు పొందుతారు. దాన ధర్మాల వల్ల ఉపశమనం లభిస్తుంది.


8, 17, 26 తేదీలలో జన్మించినవారిపై శని ప్రభావం ఉంటుంది. ఇతరులకు సహాయ పడటం, అన్యాయాన్ని ఎదిరించడం వీరి లక్షణాలు. వీరిపై ఈ సంవత్సరం కేతు, బుధ, గురు గ్రహాల ప్రభావం ఉంటుంది. శని బుధ గ్రహాలు మిత్ర గ్రహాలు. అదే విధంగా శని, గురు గ్రహాలు కూడా మిత్ర గ్రహాలు. అందువలన వీరికి ఈ సంవత్సరం భౌతిక సంపదలు, అభీష్టసిద్ధి, విజయం ప్రాప్తిస్తాయి. నూతన ఉత్సాహం, శక్తి, మంచి గుర్తింపు, సంపద, కీర్తి లభిస్తాయి. ఇన్సూరెన్స్ నుంచి ధనం రావటం, ఇన్సూరెన్స్ రంగంలో ఉన్నవారికి మంచి ఆదాయం రావటం జరుగుతుంది. విద్యార్థులు పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆస్తులు కొంటారు. కోర్టు వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలి. గొప్పవారి పరిచయాలు కలుగుతాయి. ఏ రంగంలో ఉన్నవారికైనా ఈ సంవత్సరంలో మంచి ఫలితాలు ఉంటాయి. రాజకీయ నాయకులు చాలా క్లిష్టమైన ఎన్నికలలో కూడా విజయం సాధిస్తారు.

ఈ సంవత్సరంలో వీరిపై శని, కేతు, గురు, బుధ గ్రహాల ప్రభావం ఉండటం వలన వీరు రుద్రాభిషేకం, గణపతి, ఆంజనేయ, దక్షిణామూర్తి ఆరాధన వల్ల సత్ఫలితాలను పొందవచ్చు.

9, 18, 27 తేదీలలో జన్మించినవారిపై కుజ గ్రహ ప్రభావం ఉంటుంది. 2023 సంవత్సర సంఖ్య 7, కేతు సంఖ్య. జ్యోతిష శాస్త్ర ప్రకారం కేతువు, కుజుడు రెండూ ఒకే విధమైన ఫలితాలను ఇస్తాయి. అందువలన ఈ సంవత్సరం వీరికి మంచి సంవత్సరం అని చెప్పవచ్చు. ఈ సంవత్సర సంఖ్యలో ఉన్న 2,0,3 సంఖ్యలు చంద్ర, కేతు,బుధ, గురు గ్రహ ప్రభావాలను కలుగజేస్తాయి. కుజ గురు గ్రహ ప్రభావం వలన గురు మంగళ యోగం కలుగుతుంది. దీని వల్ల రియల్ ఎస్టేట్, మైనింగ్, మిలటరీ, పోలీస్ రంగాలలో ఉన్నవారికి మంచి సంవత్సరం. నిర్మాణం మధ్యలో ఆగిపోయినవి మరల మొదలయ్యి, పూర్తి అయ్యే అవకాశం ఉంది. ఈ సంవత్సరం పెండింగ్ పనులు అన్నీ పూర్తి అయ్యే అవకాశం ఉంది. కొత్త పనులు మొదలు పెట్టడానికి ఇది మంచి సమయం కాదు.

పైకి ధైర్యంగా కనిపించినా, లోలోపల పిరికిగా ఉంటారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించాలి. రిలేషన్‌షిప్స్‌లో ఉన్నవారికి అంత బాగోదు. మనీ మేనేజ్‌మెంట్‌లో జాగ్రత్త అవసరం. అనవసర వాద వివాదాలకు దూరంగా ఉండాలి. హనుమాన్, సుబ్రహ్మణ్య ఆరాధన చేయాలి. అంగారక పాశుపత హోమం చేయించుకుంటే మంచిది. రక్తదానం చేస్తే మంచిది.

గ్రహగతులు, వాటి ప్రభావాన్ని పరిశీలించి చూస్తే, ఈ సంవత్సరంలో అందరూ తగు ప్రయత్నంతో అభివృద్ధి పథంలో పయనిస్తారు. శుభకృత్ నామ సంవత్సరం తరువాత 2023లో వచ్చే శోభకృత్ నామ సంవత్సరం, సార్థక నామధేయంతో అందరికీ కొత్త శోభను తెచ్చి పెడుతుంది.



- మహమ్మద్ దావూద్
ఆస్ట్రో-న్యూమరో-గ్రాఫాలజిస్ట్
హైదరాబాద్.